

ఘనంగా ప్రపంచ పాల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని శివరామపురంలో ప్రపంచ పాల దినోత్సవ వేడుకలను మహిళా పాడి రైతులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో మహిళా పాడి రైతులు కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీజ డెయిరీ ఏరియా అధికారి శివకుమార్ మాట్లాడుతూ పాల సేకరణలో శ్రీజ మహిళా డెయిరీ అగ్రస్థానంలో ఉందన్నారు. నాణ్యమైన పాలను డెయిరీకి అందిస్తూ మరింత అభివృద్ధికి సహకరించాలని తెలియజేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీజ కంపెనీకి మహిళా పాడి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆఫీసర్ శివకుమార్‌తో పాటు సూపర్వైజర్లు నాగార్జున, నవమోహన్, రియాజ్, టెక్నిషియన్ శివ, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మహిళా పాడి రైతులు

కౌంటింగ్‌కు కౌంట్ డౌన్

- ఇక...రెండ్రోజులే!
- ప్రతి అసెంబ్లీ, లోకసభకు 14 టేబుళ్లు
- మూడంచెల భద్రత మధ్య కౌంటింగ్
- 18 నుంచి 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం పోలింగ్ ముగిసిన దగ్గర నుంచి 21 రోజుల అనంతరం కౌంటింగ్ నిర్వహిస్తోంది. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటముల మధ్య జోరుగా బెట్టింగులు నడుస్తున్నాయి. జూన్ ఒకటిన వెలువడిన ఎగ్జిట్‌పోల్స్‌లో అస్పష్టత నెలకొంది. ఇటువంటి అస్పష్టతకు తెరదించడానికి రెండ్రోజులే సమయం మిగిలింది. కడప నగర శివారులోని మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ, అన్నమయ్య జిల్లాలో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సుబ్బయ్య ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీకి 14 టేబుళ్లు, పార్లమెంట్‌కు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌కు 14 టేబుళ్ల చొప్పున 294 టేబుళ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు 18 రౌండ్ల నుంచి 23 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. జూన్ నాలుగున ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. అనంతరం ఈవిఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు దగ్గర నుంచి సాధారణ ఈవిఎంల్లోని ఓట్ల లెక్కంపు ఏర్పాట్లను జిల్లా అధి కార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పా టు చేసింది. ఒక్కో ఇవిఎం టేబుల్ దగ్గర సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్ ఉండనున్నారు..పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు టేబుల్ దగ్గర అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్ ఉండనున్నారు. ఎలక్ట్రానికల్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ ఓట్ల లెక్కింపు వద్ద 10 టేబుల్స్‌కు ఎఆర్‌ఓ, సిఎస్, సిఎ చొప్పున ఉండనున్నారు. 130 శాతం అవసరాల మేరకు 293 కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 374 కౌంటింగ్ అసిస్టెంట్లు, 368 మంది మైక్రోఅబ్జర్వర్లను నియమించారు. సాధారణ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ నెల 25న కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. జూన్ రెండవ తేదీ రెండో విడత ర్యాండమైజేషన్ జరగనుంది. కౌంటింగ్ రోజు ఉదయం ఐదు గంటలకు మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి సిబ్బందికి కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. జూన్ ఆరవ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా నిర్వహించడానికి 112 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, కారియార్స్‌ను కవర్ చేసే విధంగా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాలులో ఈవిఎంలకు సంబంధించిన కదలికలను డిస్ ప్లే ఏర్పాట్లు చేశారు. ఇటిపిబిఎస్ స్కానింగ్ కోసం సరిపడే క్యూఆర్ కోడ్ రీడర్స్‌ను సిద్ధంగా ఉంచారు. ఏర్పాట్లకు సరిపడేలా కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, యూపిఎస్, స్టేషనరీ, టెలిఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచారు. స్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు వీవీప్యాట్లను ఎలాంటి అంతరాయం లేకుండా తీసుకెళ్లేందుకు వీలుగా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్ర ప్రదేశంలోనికి అనుమతి లేని వ్యక్తులు ప్రవే శించకుండా మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ వంద మీటర్ల పరిధిలోని రక్షణ వలయం ఉండనుంది. దీని పరిధిలోనికి ఎలాంటి వాహనాలను అనుమతించే అవకాశం లేదు. ప్రధాన ప్రవేశద్వారం వద్ద పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ అధికారుల గుర్తింపును పరిశీలిస్తారు. ఎలెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపుకార్డులను, లేదా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో, ఐడీ కార్డులను, మీడియా పాసులను పరిశీలించిన అనంతరం ప్రవేశానికి అనుమతి ఇస్తారు. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారిని నియమించారు. కౌంటింగ్ కేంద్రంలోనికి ప్రవేశించే ద్వారం వద్ద రెండో భద్రతా వలయం పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత అనుమతిస్తారు. అగ్గిపెట్టెలు, ఆయుధాలు, మొ బైల్‌ఫోన్లు, ఐప్యాడ్స్, ఇతర ఎలక్ట్రానిక్ డివైజెస్‌ను లోపలికి తీసుకెళ్ల కుండా చూస్తారు. వీటిని అక్కడ ఏర్పాటు చేసిన మీడియా గదు ల్లో భద్ర పరుచుకోవాల్సి ఉంటుంది. ఆప్రాంతంలో అనుమతించిన గదు ల్లో మాత్రమే భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రం లోనికి ప్రవేశించే ద్వారా వద్ద మూడో భద్రతా వ్యవస్థ ఉంటుంది. ఇక్కడ కేంద్ర సాయుధ బలగాలు ఉంటాయి. ఇక్కడ చేసిన తనిఖీల నిర్వహించిన అనంతరం కౌంటింగ్ హాలులోకి ప్రవేశించే అవకాశం ఉంది.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలని రైతులకు సరిపడన్ని పత్తి, వేరుశనగ, వరి విత్తనాలు, ఎరువులు, జీలగలు మంజూరు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. శనివారం కడప జిల్లా రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతంగానికి సబ్సిడీ రూపంలో వేరుశనగ, పత్తి, వరి, జీలుగులు, ఆర్‌బికె కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు వెంటనే అందించెందుకు వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. మెట్ట ప్రాంతాల్లో సాగు చేసే పత్తి విత్తనాలు అధిక రేట్లను, బ్లాక్ చేసే విధానంకు అధికారులు చర్యలు తీసుకుని కంట్రోల్ చేయాలన్నారు. రైతులకు పెట్టుబడులకు అవసరమైన విధంగా బ్యాంకులు స్కేలాఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు రైతులందరికి అందించాలన్నారు. ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కలిగించి ఏ ఎరువులు వాడాలో అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. కౌలు రైతులకు భూ యజమానులకు సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అవకతవకలుగా ఉన్న భూ సర్వేను రద్దుచేసి రైతుల సమక్షంలో గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసి గత పాసు పుస్తకాలను అనుసరించి సవరించాలన్నారు. రైతుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉన్న భూ సర్వే రద్దు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విత్తనాలు కొరత సందర్భంగా జరుగుతున్న రైతుల ఆందోళనలు ఆంధ్రప్రదేశ్ విత్తనాల కొరత జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ, మండల స్థాయిలో రైతులను చైతన్యపరిచి రైతాంగ సమస్యలు పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, వెంకటసుబ్బయ్య, చిన్న సిద్దయ్య, రామచంద్రారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. 4న కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయా లన్నారు. కౌంటింగ్ కేంద్రంలో బారికేడ్లు పటిష్టంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశామని, ప్రతి కౌంటింగ్ హాల్లో 14 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కొరకు ప్రతి టేబుల్‌కు ఒక ఎఆర్‌ఒ, ఒక సూపర్వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. ఇవిఎం కౌంటింగ్ సంబంధించి ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారని ఇందులో ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని పేర్కొన్నారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకుని తమకు కేటాయించిన కౌంటింగ్ సెంటర్‌కు వెళ్లి రిటర్నింగ్ అధికారికి రిపోర్ట్ చేయాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనలను తప్పక పాటించాలని అన్నారు. ఎన్నికల పరిశీలకులకు అవసరమైన గదులను ఏర్పాటు చేసి అబ్జర్వర్ రూంలో టివి ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్ కోర్టు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ నిరంతరాయంగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒ రంగస్వామి పాల్గొన్నారు.

'కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వరాదు'



సమావేశంలో మాట్లాడుతున్న అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికల కౌంటింగ్ లో ఎలాంటి హింసకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శాంతి భద్రతల పరిరక్షణపై రిటర్నింగ్ అధికారులు, డిఎస్‌పిలతో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్‌పి కృష్ణారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టు దిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎంతమందిపై బైండోవర్ కేసులు విధించారు, రౌడీ షీటర్లపై ఎలాంటి చర్యలు చేపట్టారు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ డిఎస్‌పిలను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రౌడీ షీటర్లపై బైండోవర్ కేసులు విధించి ఎక్కడ కూడా హింసాత్మక చర్యలు జరగకుండా ముందస్తు పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నేడు ఎగ్జిట్ పోల్ వెలువడనున్న నేపథ్యంలో అక్కడక్కడ గొడవలు జరిగే అవకాశం ఉన్నందున పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతలను కాపాడాలని పేర్కొన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు అవుతోందని, ప్రతి ఒక్కరు గుర్తించాలని పేర్కొన్నారు. 133 సెక్షన్ కింద రాళ్ళు, రప్పలు, కర్రలు లాంటి ఇతరులకు హాని కలిగించేవి ఎవరూ పెట్టుకో కూడదన్నారు. ఫైర్ క్రాకర్స్ ను పూర్తిగా నిషేధించాలని అమ్మిన కొన్న కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెట్రోల్ బంకులందు డీజిల్, పెట్రోల్, బాటిళ్లకు పట్టకుండా పెట్రోల్ బంక్ యజమానులకు కఠినమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరూ ప్రవర్తించరాదన్నారు. ఎన్నికల కౌంటింగ్ లో ఎలాంటి హింసకు తావివ్వరాదని ఎవరైనా ఎటువంటి హింస సృష్టించినా, సృష్టించాలని చూసినా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. లా అండ్ ఆర్డర్‌ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీలు లేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ అత్యంత ముఖ్యమైనదని, ఇందుకోసం పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజా తీర్పును ఖచ్చితంగా స్వాగతించాలని, ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తించి ఎటువంటి గొడవలు జరగకుండా సహకరించాల న్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి డాక్టర్ రాజ్ కమల్, డిఆర్‌ఓ సత్య నారాయణ రావు, ఆర్‌ఒలు, డిఎస్‌పిలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'బోయపల్లి టైగర్స్'

ప్రజాశక్తి-మదనపల్లి

కురబలకోట మండలం కనసానివారిపల్లి గ్రామపంచాయతీ దిగువ బోయపల్లి గ్రామానికి చెందిన ఉలికి రెడ్డప్ప కుమారుడు ఉలికి నరసింహులు మూడేళ్ల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురై మరణించాడు. నరసింహులు జ్ఞాపకార్థకంగా ఆయన సోదరులు ఉలికి మల్లికార్జున, ఉలికి నాగరాజు, నరసింహులు కుమారులు జస్వంత్, లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో స్థానిక జడ్‌పిహైస్కూల్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉలికి మల్లికార్జున చేతుల మీదుగా టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. మొదటగా బి జట్టు సభ్యులతో సి జట్టు తలపడగా బి జట్టు గెలుపొందింది తరవాత సి జట్టుతో ఎ జట్టు తలపడగా ఎ జట్టు విజయం సాధించింది. అనంతరం ఎ,బి జట్లు తలపడగా ఎ గ్రూపులో ఉన్న బోయనపల్లి టైగర్స్ జట్టు విజేతగా నిలిచింది. బి జట్టు చిత్తుగా ఓడిపోయింది. గెలుపొందిన జట్టుకు మల్లికార్జున రూ.5000లు నగదు బహుమతి, రన్నర్స్ జట్టుకు రూ.1500లు అందించారు. విజేతగా నిలిచిన సభ్యులైన గోపి, మణికంఠ, నాగరాజు, నర్సింహులు, బి రమణ,నాగచైతన్య, బి నరేష్,బి లక్ష్మణ్,సి శివ, పి రామాంజులు, బి లోకేష్,లను మల్లికార్జున అభినందించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని అన్నారు. మా అన్న మానుంచి భౌతికంగా దూరమైన ఆయన జ్ఞాపకాలు మామదిలో పదిలంగా ఉన్నాయన్నారు. ఆయనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని ఆయన జ్ఞాపకార్థకంగా ఈ టోర్నమెంట్ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.



విజేతగా నిలిచిన జట్టుకు నగదు బహుమతిని అందిస్తున్న నిర్వాహకులు



మాట్లాడుతున్న రెడ్డి సాహెబ్

దేశ ప్రజలకు మంచి రోజులు : కాంగ్రెస్

ప్రజాశక్తి-మదనపల్లి

దేశానికి మళ్ళీ మంచి రోజులు మరో మూడు రోజులలో రాబోతున్నాయని, చీకటి రోజులు కనుమరుగై కొత్త పాలన వస్తుందనే ఆశాభావాన్ని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ వ్యక్తం చేశారు. ఈనెల 4న దేశ ప్రధనమంత్రి ఎవరనేది స్పష్టంగా తెలుస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, మిత్ర పక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయనే ధీమాను వ్యక్తం చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మారిన పరిస్థితులు ఇండియా కూటమికి అనుకూలంగా వున్నాయని పేర్కొన్నారు. అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీతో సహా దాని మిత్ర పక్షాలు గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం అన్నారు. నేటి సాయంత్రం వెలువడే ఎగ్జిట్ పోల్స్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయని పేర్కొన్నారు. చీకటి రోజులు వెళ్ళి వెలుగులు విరజిమ్మే రోజు వస్తాయని, రాహుల్ గాంధీనే ప్రదానమంత్రి చేసుకోవాలని ప్రజలలో అత్యధికులు మద్దతుగా నిలబడ్డారని పేర్కొన్నారు. 10 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, పాలించే నైతికత లేదని ప్రజలు గుర్తించారని అన్నారు. రాహుల్ గాంధీ పైన నమ్మకం, విశ్వాసం వ్యక్తం చేస్తూ ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చారని, ఈడిలు, దోపిడీలు లేని నిష్పక్షపాత పాలన కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రాంతీయ పార్టీల ఇండియా కూటమి అధికారంలోకి రావాలని ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టపడ్డారని వారందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎస్.కె.బాషా, మీనాకుమారి, సోమశేఖర్, సమీర్, అన్వర్, మహబూబ్ పీర్, మొహమ్మద్ అలీ, అల్లాబక్ష్, ఖాసీం, ఈశ్వరమ్మ, శరత్ కుమార్ రెడ్డి, నాగరాజు, మస్తాన్, షాజహాన్ బాషా, సయ్యద్, సోనూ పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఆరు సంవత్సరాల ఫార్మా-డి విద్యను అభ్యసించి పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం 5వ సంవత్సరం ఫార్మా-డి విద్యార్థులు వీడ్కోలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి విద్యార్థులు, కళాశాల వారు నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో ఎంపికైన వారందరినీ అభినందిస్తూ ఈ సంవత్సరం సైంటిఫిక్ ఎరివిన, ఎపిసోడ్స్ చెన్నయ్, ఒమేగా హెల్త్ చెన్నై, బెంగళూరు, అపోలో హాస్పిటల్స్ చెన్నై, వర్చువల్ ఫిజీషియన్ స్క్రబ్బింగ్, నావిటాస్ లైఫ్ సైన్సెస్ పలు కంపెనీలలో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాన్ని సంపాదించడం హర్షణీయమని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత విద్యను పూర్తి చేసిన విద్యార్థులంతా భవిష్యత్తులో విదేశాల్లో కూడా గొప్ప ఫార్మసిస్టులుగా ఎదగాలని ఆకాంక్షించారు. డాక్టర్ పి.ద్వారకానాథ్‌రెడ్డి గతంలో విద్యార్థులు చక్కటి ప్రదర్శనతో మంచి స్థాయికి ఎదిగిన వారిని గురించి వివరిస్తూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కళాశాల యాజమాన్యం కార్యదర్శి సి.గంగిరెడ్డి, కోశాధికారి సి.అభిషేక్ రెడ్డి, చైర్మన్ సి.రామచంద్ర రెడ్డి విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం అధ్యాపకులు డాక్టర్ డి.గిరి రాజశేఖర్, డాక్టర్ ఎం.శిరీష, డాక్టర్ ఎం.ప్రమోద్ కుమార్, డాక్టర్ మణిదీప్, వినీల, హాసిని పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధ్యాపకులు

15న కవితల పోటీలు

ప్రజాశక్తి-కడప అర్బన్

శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఈ నెల 15న కవితల పోటీని నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కవితల పోటీలో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేస్తామని తెలిపారు. కడప నగరంలో ఉన్న యువతి, యువకులు పోటీలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ పోటీకి సంబంధించిన వివరాల కోసం సాహితీ స్రవంతి కన్వీనర్ లెనిన్ ప్రసాద్ సెల్ నంబర్ 919490660424, పిళ్ళా కుమారస్వామి, 9490122229ను సంప్రదించాలని తెలిపారు.

'అన్నమాచార్య' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇఇఇ విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న పాపుగారి భాస్కర ప్రసాద్‌కు అనంతపురం జెఎన్‌టియు పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇంప్రూమెంట్ ఆఫ్ డైనమిక్ బిహేవియర్ ఆఫ్ సింగిల్ పేజ్ ఇండక్షన్ మోటార్ విత్ రెనివబుల్ ఎనర్జీ సోర్సస్ ఫెడ్ రీబూస్ట్ కన్వర్టర్ విత్ డిఫ్రంట్ కంట్రోలర్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారని చెప్పారు. డాక్టర్ ఎం.పద్మలలిత, ఇఇఇ విభాగాధిపతి, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల డాక్టర్ పి.సుజాత ప్రొఫెసర్, డైరెక్టర్ ఫారెన్ అఫేర్స్ అండ్ అలుమ్నీ మేటర్స్ జెఎన్‌టియు అనంతపురం వారి ఆధ్వర్యంలో పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. వీరి పరిశోధన వల్ల పవన, సౌర విద్యుత్‌ను లోడ్‌కు ఏవిదంగా కంట్రోల్ చేయాలో తెలుసుకో వచ్చని డాక్టరేట్ పొందిన భాస్కర ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత, అధ్యాపక బృందం భాస్కర ప్రసాద్‌ను అభినందించారు.

సామాజిక కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి జోసలుకాస్ జ్యువెలరీ బ్రాంచ్‌లో శనివారం 100 రోజుల వేడుక, డొనేషన్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ నవాజ్ బాష పాల్గొని చెక్కులను వివిధ ప్రభుత్వ పాఠశాలలకు అందజేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి జోస్ అలుకాస్ బంగారు ఆభరణాలు షాప్ మదనపల్లిలో ప్రారంభించి వంద రోజుల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు కేవలం వ్యాపారం కోసమే కాకుండా సిఎస్‌ఆర్ కింద ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. మదనపల్లి చుట్టుపక్కల గల జడ్పీహై స్కూల్స్, అనాథ ఆశ్రమానికి మొత్తం సుమారు రూ.15 లక్షల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కార్యక్రమంలో సంస్థ ఎండి జోన్ అలుకాస్, మేనేజర్ హన్సన్, షోరూమ్ మేనేజర్ అలెక్స్ పాల్గొన్నారు. జోన్ అలుకాస్ సంస్థ పిఆర్‌ఒ బాబు మాట్లాడుతూ మా షోరూం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి 60 వేల కొనుగోలుపై ఒక గోల్డ్ కాయిన్ ఉచితంగా మరియు డైమండ్స్ పై 20 శతమానం డిస్కౌంట్, ప్లాటినం ఆభరణాల తరుగుపై 7 శాతం, ప్రతి కొనుగోలుపై గ్యారెంటీ గిఫ్ట్ ఇస్తున్నామని ఈ ఆఫర్ జూన్10వ తేదీ వరకు ఉంటుందని కస్టమర్ లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని కోరారు.

ఓటమి భయంతో కోర్టుకెళ్లడం సిగ్గుచేటు :'నల్లారి'


ప్రజాశక్తి-పీలేరు

వైసిపి ఓటమి భయంతో కోర్టుకు వెళ్లడం సిగ్గుచేటని పీలేరు టిడిపి అభ్యర్థి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగిరిపల్లిలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై వైసిపి నాయకులు కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది స్వచ్ఛందంగా ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులకు మద్దతునిస్తూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. వైసిపి నాయకులను ఓటమి భయం పట్టుకుందని, అందుకే రకరకాల కుట్రలు పన్నుతూ ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లడం సిగ్గు మాలిన చర్యని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి నాయకులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. టిడిపి ప్రభంజనం సృష్టించి రాష్ట్రంలో 150 సీట్ల మెజార్టీతో గెలవడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పాఠశాల నిర్వహణ గ్రాంట్‌ను చెల్లించాలి

ప్రజాశక్తి-రాయచోటి

పాఠశాల నిర్వహణ గ్రాంట్‌ను సకాలంలో చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ అభ్యాస వర్గ కార్యక్రమం శనివారం స్థానిక వైవి నాగిరెడ్డి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి.సత్యనారాయణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పాఠశాల నిర్వహణ గ్రాండ్ ను విడుదల చేయకపోవడం వల్ల పాఠశాల నిర్వహణ చాలా కష్టతరంగా మారిందని అన్నారు. వెంటనే గత రెండు సంవత్సరాల బకాయిలను, విద్యా సంవత్సరం యొక్క గ్రాంట్ ను విడుదల చేసి పాఠశాలల సజావుగా జరిగే లాగున ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి బాలాజీ,జిల్లా కోశాధికారి శివశంకర్, జిల్లా మీడియా ఇన్చార్జ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ



రోడ్డుపై నిలిచివున్న మురుగు నీరు

కుంటను తలపిస్తున్న రోడ్లు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లిలో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. స్థానిక కెనరా బ్యాంక్ వద్ద గల ప్రధాన రహదారిపై చిన్నపాటి వర్షం వస్తే చాలు రోడ్డు కుంటను తలపిస్తోంది. అటువైపుగా వెళ్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్ద కాలంగా ఉన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని అధికారులు నాయకులు పదేపదే చెబుతున్నప్పటికీ ఇచ్చిన మాట అమలులో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తురని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ వ్యర్థాలు కూడా రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యలపై కనీస దృష్టి కేంద్రీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సేవా కార్యక్రమాల్లో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం బెంగళూరు నగరంలోని జిబిఎస్ ఆస్పత్రిలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి,మందులను ఉచితంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా తమ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్,కర్ణాటక రాష్ట్రాలలో ఇప్పటివరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.నిస్వార్థమైన సేవలు అందించడమే తమ ఫౌండేషన్ సభ్యుల ముఖ్య లక్ష్యమని అన్నారు. సేవే పరమావధిగా పనిచేస్తామని ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ అభాగ్యులకు అండగా నిలిచి వారికి తోడ్పాటును అందివ్వాలని కోరారు.

ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలి

ఆర్‌బికె సిబ్బంది సమావేశంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు సంబంధించి రైతులకు కావాల్సిన ఎరువులు ఆర్‌బికెల్లో నిల్వ ఉండేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారి వెంకటకృష్ణారెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఎఒ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్‌బికె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువుల పరిమాణం కోసం ఇండెంట్ పెట్టి స్టాక్ తెప్పిం చుకోవాలన్నారు. వేరుశనగ విత్తనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే కొర్ర, మినుము, పెసర, కంది రకాలు ఆర్‌బికెల వారీగా కావాల్సిన విత్తనాల పరిమాణాలను రైతులను అడిగి తెలుసుకుని నివేదికలు ఇవ్వాలన్నారు. సిబ్బంది ఆయా గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు ఇవ్వాలన్నారు. వేరుశనగ విత్తనాల పంపిణీకి సంబంధించి రైతు వాటా డబ్బులను విత్తన ఏజెన్సీకి చెల్లించాలని సిబ్బందికి ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహించకుండా ప్రతి రోజు సమయపాలన పాటించాలన్నారు. అన్ని రకాల రిజిష్టర్లను అప్డేట్ చేసి పెట్టుకోవాలని కోరారు. ఖరీఫ్‌లో నిర్వహించే పొలంబడి గురించి సిబ్బందితో చర్చించారు. అనంతరం నెలవారీ రైతు భరోసా మాస పత్రిక పుస్తకాలను సిబ్బందికి అందించారు.

వైసిపి నేతలకు పోలీసుల అండదండలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో వైసిపి నేతలకు కొంతమంది పోలీసుల అండదండలున్నాయని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు రోజున ప్రొద్దుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా గుర్తించిన 135 మంది ట్రబుల్ మాంగర్స్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఉంచాలన్నారు. అలా కాకుండా జిల్లా బహిష్కరణ చేస్తే ఎక్కడికి వెళతారని వరదరాజుల రెడ్డి ప్రశ్నించారు. గతనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల అవాంఛనీయ సంఘటనలు జరిగాయని, మాచర్లలోని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఇవిఎంలను పగులు కొట్టడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా ఉందని ఆయన భావించారు. ప్రొద్దుటూరులో ఓ హత్యా నేరంలో నిందితులు ట్రబుల్ మాంగర్స్‌లా పోలీసులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. వైసిపి నాయకులను వదిలిపెట్టి టిడిపి నాయకులను టార్గెట్ చేస్తున్నారంటూ వరద తీవ్రంగా విమర్శించారు. వైసిపిలో ఉన్న రౌడీషీటర్లపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అమీర్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.40 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్, శిల్పారామంలో నృత్య ప్రదర్శన ఉంటుందని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో స్థానిక విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ వారి నాగార్జున స్కూల్ చిన్నారులచే డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో.. శిల్పారామంలో స్థానిక శ్రీ రాజా కళానిలయం ఆధ్వర్యంలో క్లాసికల్, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

క్రీడా మైదానంలో స్తంభాలను తొలగించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక ముద్దనూరు రోడ్డు పతంగి రామన్నరావు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడాకారులకు, విద్యార్థులకు ఉపయోగపడని స్తంభాలను ఉన్నతాధికారులు తొలగించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) పట్టణ కార్యదర్శి నంద్యాల తులసీశ్వర యాదవ్ కోరారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పిఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిరుపయోగంగా ఉన్న స్తంభాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తులసీశ్వర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా పతంగి రామన్న ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎవ్వరికీ ఉపయోగపడకుండా క్రీడాకారులకు పాఠశాల కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటలాడుకోవడానికి అడ్డుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ పరంగా ఆటల పోటీలు నిర్వహించాలంటే ఇవి మరి అడ్డుగా మారాయన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు వీటిని ఎందుకు తొలగించడం లేదని ఆయన ప్రశ్నించారు. క్రీడా మైదానం అన్యాక్రాంతానికి గురవుతోందన్నారు. ఒకప్పుడు రాష్ట్రస్థాయి లాంటి అథ్లెటిక్స్ వంటి పోటీలు కూడా నిర్వహించారని అన్నారు. పట్టణంలోని ప్రజలకు, యువతకు క్రీడా మైదానం అణువుగా ఉందన్నారు. ఈ స్థాయిలో జిల్లాలో ఎక్కడ లేదన్నారు. అధికారులు స్పందించి పతంగి రామన్న ఉన్నత పాఠశాల క్రీడా మైదానం పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సూరి, రాఘవ, కేశవ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని భూమాయపల్లె వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న వృద్ధాశ్రమంలో శనివారం వైసిపి నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అగ్రహార సహకార సంఘం అధ్యక్షులు పివి రాఘవరెడ్డి, నాయకులు సుభాన్, నాగేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

కొనలేక ఇబ్బందులు పడుతున్న సామాన్యులు



వీరబల్లిలోని కూరగాయాల మార్కెట్

ప్రజాశక్తి-వీరబల్లి

గత 15 రోజుల నుంచి కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. కొను గోలు దారులకు పట్ట పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. కూలీ నాలి చేసుకున్న జీవనం సాగించే వారి పరిస్థితి దయనీయంగా మారింది. గుప్పెడు మెతుకులు తినాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌కు రూ.500 తీసుకొని పోతే 5 రకాల కూరగాయలు కొనే పరిస్థితి లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. మండలంలో కూరగాయల పంటలు సాగు తక్కువ ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో కూలి పని చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పెరిగిన ధరలతో ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు రాయచోటి మార్కెట్‌లో నుంచి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేస్తారు. అక్కడ కూరగాయల ధరలు ఎక్కువ రేటు పడడం వలన ఇక్కడ వ్యాపారస్తులు లాభం తీసుకుని వినియోగదారులకు అమ్ముతున్నారు. అంత రేటు పెట్టి కూరగాయల కొనలేక కూలి పని చేసుకునే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో కూరగాయల దిగుబడి వస్తేనే ధరలు అదుపులోకి వస్తాయని వ్యాపారస్తులు చెప్తున్నారు. బెంగళూరు, బెల్గాం,చిత్తూరు, మదనపల్లి, కలికిరి పట్టణాల నుంచి వ్యాపారులు రాయచోటి మార్కెట్ కూరగాయలను దిగుమతి చేసుకుంటారు.వంకాయలు, ఆకుకూరలు, ఇతర జిల్లాల నుంచి దిగుమతి అవుతాయి.

ధరలు అమాంతంగా పెరిగాయి



కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.మాలాంటి కూలీనాలి చేసుకుని పేదలు కొనుగోలు చేసుకోలేకపోతున్నాం. కూరగాయల సంతకు వెళ్లి కిలో టమోటాలు, అరకిలో కిలో పచ్చిమిర్చి, అరకిలో బీరకాయ, అరకిలో వంకాయలు, అరకిలో బెండకాయలు, అరకిలో కాకరకాయలు, రెండు ఆకుకూరల కట్టలు, కొనుగోలు చేశా. 350 రూపాయలు దాకా ఖర్చయింది. గతంలో 200 తీసుకొనిపోతే ఐదారు రకాల కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

-నాగలక్ష్మి, వీరబలి

కొనలేం..తినలేం



నిత్యవసర సరుకులు అమాంతంగా పెరిగిపోయాయి. సరుకులు కొనలేని పరిస్థితి. మార్కెట్ కు పోవాలంటే భయపడే పరిస్థితి వచ్చింది.రూ.200 పెడితే గతంలో వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి.రూ.500 పెట్టి కూరగాయలు కొన్న కూరగాయలు వారానికి కూడా సరిపోవడం లేదు. ఏమి తిని బతకాలో అర్థం కావడం లేదు.

-శ్రీధర్,వంగిమళ్ళ

కూరగాయ పంటలు లేకపోవడమే కారణం




గ్రామీణ ప్రాంతాల్లో రైతులు సాగు చేసే కూరగాయలు మార్కెట్ వస్తేనే ధరలు తగ్గు ముఖం పడుతాయి.. రైతుల వద్ద కూరగాయలు లేకుంటే ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు కూరగాయల పంటలు లేవు. దీనితో స్థానిక వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తున్నారు. దీనితో రవాణా, ఇతర చార్జీలతో కలిపి విక్రయిస్తారు.. దాని మూలంగానే మార్కెట్ లో కూరగాయల ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీనితో పాటు పెళ్ళిల్ల సీజన్ కూడా ఉండడం తో కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు అమాంతం ధరలను పెంచినట్లు ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో నుంచి రైతులు కూరగాయలు తీసుకు వస్తేనే ధరలు దగ్గే అవకాశం ఉంటుందని పలువురు వాపోతున్నారు. కాని మార్కెట్ లో కూరగాయల ధరలు చూసిన ప్రతి ఒకరు అమ్మో ఇవేం ధరలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-చింతాతి రాంప్రసాద్ వీరబల్లి.

మండలంలో కూరగాయల ధరలు

కూరగాయాలు	కిలో. ధర
టమోటాలు	రూ.50
కాకరకాయలు	రూ.100
పచ్చిమిర్చి	రూ.120
బెండకాయలు	రూ.60
ముల్లంగి	రూ.80
పచ్చి బఠానీ	రూ.200
చిక్కుడు కాయలు	రూ.120
బీరకాయలు	రూ. 80
క్యాప్సికం	రూ.100

ఉద్యోగికి విరమణ తప్పనిసరి



సుబ్బరాయుడును సన్మానిస్తున్న ఉద్యోగులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసిలో చలానా పాయింట్ గ్రేడ్-2 ఉద్యోగి పనిచేస్తున్న నారాదాసు సుబ్బరాయుడు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయనను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సుబ్బరాయుడు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ ప్రధాన కార్యదర్శి పనిచేసి కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారని కొనియాడారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది ఉంటుందని, 15 సంవత్సరాల క్రితం ఎపిఎండిసి సంస్థకు ఇల్లు, భూమి ఇచ్చి త్యాగం చేశారని అన్నారు. ఎపిఎండిసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం మాత్రమే ఇచ్చిందన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు జెఎసి పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేసి సమాన పనికి సమాన వేతనం ఇప్పించామని అన్నారు. సుబ్బరాయుడు సేవలు సిఐటియుకు అవసరం ఉందని ఆయన సేవలను వినియోగించుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి పోరాట కమిటీ కన్వీనర్ ఆర్ వెంకటేష్, వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బండారు భాస్కర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జ్యోతి, నాగరాజు, పెంచలయ్య, ఉదయ్ కుమార్, రాజు, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మర్రి శంకరయ్య, మావిళ్ళ రాధాకృష్ణ, గునిపాటి కేశవులు, గల్లా చలపతి, మనోహర్, పోరాట కమిటీ నాయకులు గునిపాటి మనీ, హరి వర్మ, గునిపాటి రవి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి



మదనపల్లి: రాజకీయ నాయకులకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి మోహన్‌రావు



తంబళ్లపల్లి: పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కలికిరి

ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి డిఎస్‌పి మోహన్ రావ్ ప్రజలను హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు సిఐ ఆర్.మోహన ఆధ్వర్యంలో డిఎస్‌పి ఎన్నికల నియమావళి పై రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 6వ తేదీ వరకు రాష్ట్రంలో ఎన్నికలకు కోడ్ అమలులో ఉంటుందని,4న జరిగే కౌంటింగ్ సందర్భంగా రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నాయకులు వారి అనుచరులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి పిడి ఆక్ట్ అమలు చేస్తారని అన్నారు. నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తారని, మూడవ తేదీ నుంచి మద్యం అమ్మకాలు నిలిపివేస్తారని, ఎక్కడైనా మద్యం తాగి బయట కనబడితే కేసులు నమోదు చేస్తారని చెప్పారు. మండల కేంద్రానికి జిల్లా కేంద్రాలకు ఎవరు వెళ్లకూడదని, ఎవరి ఇంటిలో వారు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గెలిచిన అభ్యర్థుల అనుచరులు గానీ, నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఊరేగింపులు కానీ, క్రాకర్స్ కాల్చడం గాని జరపు రాదని అన్నారు. 7న పోలీసుల అనుమతితో ఊరేగింపులు జరుపుకోవాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని పోలీసులకు సహకరించి మండలం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్ఐ దేవేంద్ర కుమార్, పోలీస్ సిబ్బంది, తెలుగుదేశం, జనసేన, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** సాధారణ ఎన్నికల లెక్కింపు సందర్భంగా ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలని మొలకలచెరువు సిఐ మధు తెలిపారు. పాటించని వారికి కఠిన చర్యలు తప్పవు హెచ్చరించారు. స్థానిక పోలీసులు, సిఆర్‌పి బలగాలు మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఇసి ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకూడదని రోడ్లు పైకి రాకూడదన్నారు. ఇతరులను రెచ్చగొట్టే విధంగా సంభాషణలు చేయరాదన్నారు. ఎవరైనా అటువంటి కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌటింగ్ గుంపులు గుమికూడదని, ఎవరి ఇళ్లలో వారు ఉండాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్ఐ వెంకట శివకుమార్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



మదనపల్లి: హనుమజ్జయంతి ఉత్సవాల్లో షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని నిమ్మనపల్లి, పెద్దమాదిగ పల్లె, దిగువపల్లె, అక్కగార్ల కుంటలో హను మాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నిమ్మనపల్లిలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో, ఆలయ ధర్మకర్త మంగళంపేట బయమ్మ, శంకరయ్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యు లు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి విశేష విద్యుత్ దీపాలంకరణ చేశారు. శ్రీ అభయాంజనేయ స్వామికి ఉదయం అంకురార్పణ, పుణ్యవచనం పంచామృతాభిషేకం, ఆకు పూజ, పుష్పాభిషేకం, హెూమాలు నిర్వహించారు. స్వామివారు విశేష అలంక రణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఉత్సవాలలో భాగం గా నేడు ఆదివారం రాత్రి శ్రీ భద్రాద్రి సీతారాముల కళ్యాణం, లంకా దహనం, తొమ్మిది కిలోల లడ్డు వేలం పాట, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు జరుగుతాయన్నారు. సోమవారం పగలు ఉట్లు తిరుణాల, ఉట్ల మాను ఎక్కిన వారికి బహుమతిగా రూ.1,116లు అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలి పారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. **మదనపల్లి :** హనుమాన్ జయంతి సందర్భంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా పట్టణం వరాల ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం పట్టణం నీరుగట్టువారి పల్లిలో కాట్లాటపల్లి రోడ్‌లోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పూజా అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. **రామసముద్రం :** మండలంలోని ఎలకపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో హనుమాన్ చాలీసా, ద్వాదశాక్షర మంత్రము, అష్టోత్తరములుతో భక్తిశ్రద్ధలతో హనుమంతుడిని అర్చించారు. ఆలయ అర్చకులు శంకరాచారి ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకు పూజ, వడమాల పూజ వంటి తదితర పూజలతో స్వామి వారిని అర్చించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. హరికథ నాటకాలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొంతమంది భక్తులు దేవాలయం అభివృద్ధి కార్యక్రమాలకు విరాళాలు అందించడానికి ముందుకొచ్చారు. దేవాలయం అభివృద్ధి కొరకు విరాళాలు అందించే భక్తాదులు 9900682121 నంబరును సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. **బి.కొత్తకోట :** హనుమాన్ జయంతిని పట్టణంలో శ్రీమహావిష్ణు సేన ఆధ్వర్యంలో శ్రీహనుమాన్ శోభా యాత్ర కన్నుల పండుగలా సాగింది. పట్టణంలోని దిగువ బస్టాండులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బైపాస్ రోడ్డు, జ్యోతి చౌక్, ప్రభుత్వ ఆస్పత్రి నుంచి దిగువ బస్టాండులోని శ్రీఆంజనేయ స్వామి దేవస్థానం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో అగ్రభాగాన హనుమంతుడి విగ్రహ ఊరేగింపులో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. **కలకడ:** హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని బాటవారిపల్లెలో వేసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి గుట్టపల్లిలో వెలిసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారుఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు అన్నప్రసాదాలను అందించారు.



పట్టణంలో పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

బి.కొత్తకోటలో పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి -బి.కొత్తకోట

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలో శనివారం సిఐ సూర్యనారాయణ ఆదేశాల మేరకు పోలీసులు పికెటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఎస్ఐ బొజ్జ నాయక్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున ప్రధాన పార్టీల కార్యకర్తలు సంయమనం పాటించాలని అన్నారు.ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజకీయనాయకుల కోసం తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

టిడిపి నాయకుడికి నివాళులు

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని మూగవాడి పంచాయతి కొత్తూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పెద్ద పాపిరెడ్డి గారి శంకర్‌రెడ్డి అకాల మరణం చెందారు. మదనపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్ భాషా ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. శంకర్ రెడ్డి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మదనపల్లి మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మదనపల్లి నాయకులు గుండాల రామచంద్ర రామసముద్రం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు విజయకుమార్ గౌడ్ , మదనపల్లి సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, కృష్ణంరాజు, రాజేష్ స్వామి, తెలుగు యువత అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, మైనార్టీ నాయకులు ఒంటెల అల్తాఫ్‌బాషా పాల్గొన్నారు.

టిడిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

మండలములోని చిట్లూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గాలివీటి సురేంద్రరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. స్థానిక నాయకులు ద్వారా విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి సురేంద్రరెడ్డిని పరామర్శించి,ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. తర్వగా కోలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లకు చేరిన పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని పాఠశాలలకు అందించవలసిన పాఠ్యపుస్తకాలు శనివారం ఎర్రగుంట్లకు చేరినట్లు మండల విద్యాశాఖ అధికారులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 43వేల పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేయవలసి ఉండగా, ఇందులో 50 శాతం మండల కేంద్రానికి చేరాయని తెలిపారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు కూడా త్వరలో చేరుకుంటాయని తెలిపారు. మండల కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి పాఠశాలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజ నేయులు రెడ్డి, మండల విద్యాశాఖ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

దేశ చరిత్రపై విద్యార్థుల పఠనం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులచే దేశ చరిత్రపై కతన పఠనాన్ని చేయించారు. గ్రంథాలయ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ దేశ చరిత్రపై, స్వతంత్ర సమరయోధులపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులుపాఠకులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె పాత కళాశాల మైదానంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ లోని పిల్లలకు పలువురు దాతలు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.శిక్షణా శిబిరంలో శిక్షణ పొందుతున్న వంద మంది పిల్లలకు పట్టణానికి చెందిన బిబిజె ఫ్యూల్స్ బాషా, నిజాం టెక్స్ టైల్స్ జహీర్, ఇండియన్ ఆయిల్ ఇలియాజ్, నౌషీర్, డాక్టర్ మున్నా, స్టాంప్ రైటర్ మస్తాన్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులు క్రీడాదుస్తులను వినియోగించుకోవాలని సూచించారు. చదువుతో పాటు ఆటల్లో మక్కువ పెంచుకోవాలని తెలిపారు. స్థానిక వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు దాతలను శాలువ, పూల మాలలతో సన్మానించారు.



క్రీడా దుస్తులతో విద్యార్థులు